నేడు యథావిధిగా పెన్షన్ల పంపిణీ

సచివాలయ ఉద్యోగుల ఆందోళనల ప్రభావం లేకుండా చర్యలు

డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో సామజిక పెన్షన్ల పంపిణీ అక్టోబర్ 1నే పంపిణీ జరిగేలా అన్ని చర్యలూ తీసుకున్నామని డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షన్ల పంపిణీ నిమిత్తం నగదును ఇప్పటికే బ్యాంకుల నుండి డ్రా చేశారని, అక్టోబర్ 1వ తేదీ ఉదయం ఏడు గంటల నుండి సచివాలయ సిబ్బంది పెన్షన్ల పంపిణీ చేపడతారని పేర్కొన్నారు. అనివార్య కారణాల వల్ల ఆ రోజు పెన్షన్లు తీసుకోని వారికి మూడో తేదీన పంపిణీ చేస్తారని తెలిపారు. సచివాలయ ఉద్యోగుల ఆందోళనల ప్రభావం పెన్షన్ల పంపిణీపై లేకుండా చర్యలు తీసుకున్నామని పీడీ పేర్కొన్నారు.

నిత్యావసరాల...

ధరలు తగ్గితే ఒట్టు..!

సామాన్య ప్రజానీకానికి దక్కని జిఎస్‌టి తగ్గింపు ఊరట

పప్పులు, వంటనూనె వంటి నిత్యావసరాల ధరలు భగభగ

ఆహార ఉత్పత్తుల ధరలు తగ్గకపోవడంపై జనంలో చర్చ

సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్ నినాదంపై విమర్శలు

ధరల మోతతో దసరా పండుగకు సామాన్యులు దూరం

సూపర్ జిఎస్‌టి..సూపర్ సేవింగ్స్ అంటూ ప్రభుత్వం విడుదల చేసిన పోస్టర్



సెప్టెంబర్ 29న ధరల పట్టిక

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'సూపర్ జిఎస్‌టి.. సూపర్ సేవింగ్స్'. 'మహిళల అభ్యున్నతికి సాకారం.. సూపర్ గిఫ్ట్ ఇచ్చిన ఎన్‌డిఎ ప్రభుత్వం' అంటూ ప్రభుత్వం విడుదల చేసిన పోస్టర్లు, ప్రచారంపై సామాన్య ప్రజానీకం పెదవి విరుస్తున్నారు. ప్రజలు నిత్యం ఉపయోగించే నిత్యావసరాల ధరలు తగ్గించకుండా సామాన్య ప్రజానీకానికి ఏవిధంగా సూపర్ గిఫ్ట్ అందినట్లని ప్రశ్నిస్తున్నారు. జిఎస్‌టి 2.0 అంటూ కేంద్ర ప్రభుత్వం పన్నుల శ్లాబుల్లో మార్పులు చేసింది. సెప్టెంబర్ 22వ తేదీ నుంచి అమల్లోకి తెచ్చింది. జిఎస్‌టి తగ్గింపుతో సామాన్యుల బతుకుల్లో పెనుమార్పులు వస్తాయని పాలకులు తెగ ఊదరగొడుతున్నారు. దీనికోసం ప్రత్యేకంగా ప్రచార ఆర్భాట కార్యక్రమాలు నిర్వహిస్తూ అధికార యంత్రాంగాన్ని మొత్తం పరుగులు పెట్టిస్తున్నారు. జనాలు మాత్రం జిఎస్‌టి 2.0పై పెదవి విరుస్తున్నారు. కార్లు, టీవీల వంటి వాటి ధరలు తగ్గడం వల్ల సామాన్యులకు ఏవిధమైన ఉపయోగం ఉండదని, నెలవారీ సంపాదనల్లో అత్యధిక భాగం ఖర్చుపెట్టే నిత్యావసరాల ధరలు తగ్గినప్పుడే ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 40 లక్షల జనాభా ఉన్నారు. దీనిలో 80 శాతం సామాన్య ప్రజానీకమే. వ్యవసాయ కూలీలు, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు, దుకాణాల్లో పని చేసేవారు, చిరు వ్యాపారులే అత్యధికంగా ఉన్నారు. నెలవారీ సంపాదనలో అత్యధికంగా నిత్యం వాడే ఆహార ఉత్పత్తులకే జనం ఖర్చు పెడతారు. ఖరీదైన కార్లు, టీవీలు వంటివి సామాన్యులు కొనుగోలు చేయడం ఉండదు. జిఎస్‌టి 2.0 సంస్కరణలు అమల్లోకి వచ్చినప్పటికీ నిత్యావసరాల ధరల్లో ఏమాత్రం మార్పు లేదు. గతంలో మాదిరిగానే కందిపప్పు ధర వంద నుంచి రూ.120 పలుకుతోంది. మినపప్పు కిలో రూ.105 ఉండగా, ఎండుమిర్చి రూ.180గా ఉంది. సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటర్ రూ.126 ఉండగా, విజయ ఆయిల్ రూ.150 పలుకుతోంది. పెసరపప్పు కిలో రూ.120, వేపుడు శెనగపప్పు కిలో రూ.110గా ఉంది. వెల్లుల్లి ధర కిలో రూ.200 ఉండగా, అన్ని రకాల నిత్యావసరాల ధరలు భగభగమంటూ మండుతూనే ఉన్నాయి. ఆగస్టు నెలలో ఏవిధమైన ధరలున్నాయో ఇప్పటికీ అవే ధరలు ఉన్నాయి. దీంతో ధరలు ఎక్కడా తగ్గాయని సామాన్య ప్రజానీకం ప్రశ్నిస్తున్నారు. పాలు, ఔషధాలపై జిఎస్‌టి తగ్గించినా వ్యాపారులు హెచ్చుధరలకే విక్రయిస్తున్నారు. దీంతో సామాన్య ప్రజానీకం ప్రభుత్వం చెబుతున్న మాటలపై పెదవి విరుస్తోంది.

సామాన్యులు దసరా పండుగకు దూరం

నిత్యావసరాల ధరలు ఏమాత్రం తగ్గకపోవడంతో సామాన్య ప్రజానీకం దసరా పండుగను సంతోషంగా జరుపుకోలేని పరిస్థితి నెలకొంది. దసరాకు పిండివంటలు వంటివి ప్రత్యేకంగా చేస్తారు. వంటనూనె, పప్పుల ధరలు భారీగా ఉండటంతో సామాన్య ప్రజానీకం పిండి వంటలకు దూరంగా ఉంటున్నారు. చిన్నపాటి పిండి వంట చేయాలన్నా రూ.వేలల్లో ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో సామాన్యుల ఇళ్లలో పిండి వంటలు కానరాని పరిస్థితి నెలకొంది. నెలకు రూ.15 వేలు సంపాదించే చిరుద్యోగి సైతం ఇంట్లో ఉపయోగించే నిత్యావసరాలకు నెలకు రూ.పది వేల వరకూ ఖర్చు చేయాల్సి వస్తోంది. నిత్యావసరాల ధరలు తగ్గితే సామాన్యులకు ఊరట లభించేది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం చెబుతున్న మాటలపై సామాన్య ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

గోదావరి ఉగ్రరూపం

ప్రధాన రహదారులను ముంచెత్తిన వరద

40 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

ఆందోళనలో విలీన మండలాల ప్రజలు

పోలవరం నుండి 10,50,735 క్యూసెక్కుల జలాలు విడుదల

కుక్కునూరు రూరల్ : కుక్కునూరు-దాచారం రహదారిపై వరద నీరు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, ప్రాజెక్టుల్లో సామర్థ్యానికి మించి ఉన్న నీటిని దిగువకు వదలడంతో గోదావరికి వరద పోటెత్తుతోంది. ఇప్పటికే మండలంలో నాలుగు రోజులుగా కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగుపై కాజ్‌వే, ముత్యాలంపాడు-వింజరం మధ్య పాలవాగుపై కాజ్‌వే నీట మునగడంతో 15 గ్రామాలకు రాకపోకలు నిలిచే ఉన్నాయి. వరద ఉధృతి పెరగడంతో మంగళవారంనాడు సీతారామనగరం-శ్రీధర వేలేరు మధ్య ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరడంతో ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. భద్రాచలంలో సోమవారం నాడు 44.9 అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం మంగళవారం నాటికి అనూహ్యంగా పెరిగి 50 అడుగులకు చేరింది. దీంతో రెండో ప్రమాద హెచ్చరిక అమలులో ఉంది. వరద పెరుగుతుండటంతో అధికారులు లోతట్టు ప్రాంతాలైన గొమ్ముగూడెం, కౌండిన్యముక్తి, లచ్చిగూడెం గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మరో రెండు అడుగులు పెరిగితే కుక్కునూరు-భద్రాచలం మధ్య ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరి ప్రమాదం ఉంది.

వేలేరుపాడు రూరల్ : రుద్రంకోట రహదారి వద్ద నీట మునిగిన బ్రిడ్జి

వేలేరుపాడు రూరల్: వరద గోదావరి మండలాన్ని చుట్టుముట్టడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. సెప్టెంబర్‌లో గోదావరి వరద ఉధృతి ఈస్థాయిలో రావడం ఎన్నడూ చూడలేదని పలువురు చెబుతున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి 50 అడుగులకు చేరుకోవడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే వరద చుట్టుముట్టడంతో రుద్రంకోట, రేపాకగొమ్ము రహదారులపై రాకపోకలు సాగించే వీల్లేక జనం నానాఇబ్బందులు పడుతున్నారు. కొయిదా వెళ్లే మార్గంలో శుద్ధ గుంపు వద్ద రోడ్డుపైకి వరద నీరు చేరడంతో కన్నాయిగుట్ట, నాళ్లవరం, తూర్పుమెట్ట, బోళ్లపల్లి, ఎడవల్లి, కాచారం, కోయిదా, కట్కూరు తదితర 20 గ్రామాలకు రాకపోకలు నిలిచాయి.

పోలవరం నుండి 10,50,735 క్యూసెక్కుల జలాలు విడుదల

పోలవరం: పోలవరం వద్ద గోదావరి వరద మంగళవారం సాయంత్రానికి ఉగ్రరూపం దాల్చింది. కడెం, మంజీర, హరిద్ర, ఇంద్రావతి, మానేరు, ప్రాణహిత, కిన్నెరసాని, శబరి, సీలేరు ఉపనదులు పొంగి గోదావరిలో కలుస్తున్నాయి. దీంతో గోదావరి నీటిమట్టం అనూహ్యంగా పెరుగుతోంది. పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 10,50,735 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 32.900 మీటర్లు, స్పిల్‌వే దిగువన 24.500 మీటర్లు, ఎగువ కాపర్ డ్యామ్ ఎగువన 33.600 మీటర్లు, దిగువ కాపర్ డ్యామ్ దిగువన 23.820 మీటర్లు, ఎగువ, దిగువ కాపర్ డ్యామ్‌ల మధ్య 16.030 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ ఇసుక తిన్నెలు నీట మునుగుతున్నాయి.

పోలవరం : పట్టిసీమ వద్ద పెరుగుతున్న గోదావరి వరద

చులకన భావంతో చూడొద్దు

సమస్యలు పరిష్కరించాలని పిహెచ్‌సి వైద్యుల నిరసన

ప్రభుత్వం స్పందించకపోతే ఆమరణ నిరాహార దీక్షకైనా సిద్ధమని స్పష్టం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజలకు నిర్విరామంగా, ఎటువంటి పరిస్థితుల్లోనైనా వైద్య సేవలందిస్తున్న తమను చులకన భావంతో చూడొద్దంటూ ప్రభుత్వానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు మొర పెట్టుకున్నారు. ఏలూరులోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం వద్ద మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిఒ 99 ఉపసంహరించుకోవాలని, ఆ జిఒ ద్వారా తమకు తీవ్ర నష్టం జరుగుతుందని వాపోయారు. గతంలో పీజీ సీట్లలో పిహెచ్‌సి వైద్యులకు 30 శాతం సీట్లు కేటాయించే వాళ్లని, అయితే జిఒ నెంబర్ 85 ద్వారా గతేడాది 15 శాతం సీట్లకు తగ్గించిందని, దీంతో పిహెచ్‌సి వైద్యులంతా ఆందోళన చేయడంతో 20 శాతం సీట్లు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. అయితే మళ్లీ 99 జిఒ ద్వారా 15 శాతానికి తగ్గించినట్లు తెలిపారు. దీని ద్వారా తమకు తీవ్ర నష్టం జరుగుతుందని వాపోయారు.

గతేడాది ఆందోళన చేసినప్పుడు పిహెచ్‌సి వైద్యుల సమస్యలన్నీ పరిష్కరిస్తానని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అయితే ఇప్పటివరకు ఏ ఒక్క హామీ అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పిహెచ్‌సి వైద్యులుగా చేరిన వారికి ప్రమోషన్లు ఇవ్వకపోవడంతో ఉద్యోగ విరమణ వరకు అదే ఉద్యోగంలో కొనసాగుతున్నామని వాపోయారు. దీంతో టైం బౌండ్ ప్రమోషన్లు అమలు చేయాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న పిహెచ్‌సి వైద్యులకు బేసిక్ పేపై 50 శాతం అలవెన్స్ ఇవ్వాలని ఎప్పటి నుంచో అడుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని, చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమం కింద వైద్యులకు రూ.ఐదు వేల అలవెన్స్ నేటివిటీ, అర్బన్ ఎలిజిబిలిటీ సమస్యల పరిష్కారంతో పాటు పిహెచ్‌సి వైద్యులకు కచ్చితమైన పనిగంటలు, స్థిరమైన వారాంతం సెలవులు కల్పించాలని కోరారు. ప్రస్తుతానికి స్ట్రైక్‌ను జిల్లాకే పరిమితం చేశామని, వచ్చేనెల మూడో తేదీ నుంచి చలో విజయవాడ కార్యక్రమాన్ని పిలుపునిచ్చామని, రిలే నిరాహార దీక్షలు చేస్తామని, ప్రభుత్వం స్పందించకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని తెలిపారు. దయచేసి ప్రభుత్వం అర్థం చేసుకొని తమ డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి పిహెచ్‌సి వైద్యులు అసోసియేషన్ అధ్యక్షురాలు గంగాభవాని, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జేష్ఠ గణేష్, ఎపిపిహెచ్‌సిడిఎ జిల్లా జనరల్ సెక్రటరీ షేక్ జోషిమా, జిల్లా పిహెచ్‌సి వైద్యులు పాల్గొన్నారు.

ఆమరణ నిరాహార దీక్షకైనా సిద్ధం

జేష్ఠ గణేష్, పిహెచ్‌సి స్టేట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ

ఎన్నో క్లిష్ట పరిస్థితుల్లో, మొబైల్ సిగ్నల్ కూడా లేని ప్రాంతాల్లో, గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు వైద్యం అందిస్తున్నాం. ఈ రెండు రోజులు నిరసనను జిల్లాకు మాత్రమే పరిమితం చేశాం. అక్టోబర్ మూడో తేదీ నుంచి చలో విజయవాడ కార్యక్రమంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టబోతున్నాం. ప్రభుత్వం అప్పటికి స్పందించకపోతే ఆమరణ నిరాహార దీక్షకైనా కూర్చుంటాం.

మాకు తగిన న్యాయం చేయాలి

షేక్ జోషిమా, ఎపి పిహెచ్‌సి డిఎ జిల్లా జనరల్ సెక్రటరీ



రోడ్లు కూడా సరిగ్గా లేని ప్రాంతాల్లో ఇంటింటికి, వీధి వీధికి తిరుగుతూ ప్రజలకు వైద్యం అందిస్తున్నాం. వాగులు, వరదలు వచ్చినప్పుడు ట్రాక్టర్లు ఎక్కి ప్రజలకు వైద్యం అందించడానికి వెళ్లాం. మేము అడిగేవి డిమాండ్లు కాదు మా అవసరాలు. ప్రభుత్వం దీన్ని గుర్తించాలి. మాకు తగిన న్యాయం చేయాలని కోరుతున్నాం.

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను ఆపాలి

వైసిపి ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను కూటమి ప్రభుత్వం తక్షణమే నిలుపుదల చేయాలని వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ముందుగా ప్రయివేటీకరణను నిలుపుదల చేయాలని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తెర ఆనంద్ మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రయివేటీకరణను కూటమి ప్రభుత్వం వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడా లేని పిపిపి విధానాన్ని కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిందని, ప్రయివేటీకరణతో పేద, మధ్యతరగతి ప్రజలు నష్టపోతారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఈ ఆలోచనను వెనక్కి తీసుకుని మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నడపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ ఏలూరు నగర అధ్యక్షుడు జగదీష్, ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి జాన్ గురునాథ్, ఎస్‌సి సెల్ రాష్ట్ర నాయకుడు నూకపెయి సుధీర్‌బాబు, వైసిపి ఎస్‌సి సెల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న వైసిపి నేతలు

సురక్షిత ప్రాంతాలకు ముంపు ప్రాంత ప్రజల తరలింపు

బోట్లు, గజ ఈతగాళ్లను సిద్ధం చేయాలి

గ్రామ, మండలస్థాయి అధికారులంతా విధుల్లోనే ఉండాలి

అధికారులకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశం

ప్రజాశక్తి - ఏలూరు

గోదావరి నదికి భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయిన దృష్ట్యా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేలా ముందస్తు ప్రణాళికతో సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు బోట్లు, గజ ఈతగాళ్లను సిద్ధం చేయాలన్నారు. ముంపు ప్రమాదం ఉండే ప్రాంతాల ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, వృద్ధులు, పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారిని, విభిన్న ప్రతిభావంతులను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వరద ఉధృతి ఎక్కువగా ఉన్న కాజ్‌వే, కల్వర్టుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రజలు రాకపోకలు సాగించకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వరద ఉధృతి ఎక్కువగా ఉన్న నదులు, కాలువలు, చెర్వుల్లోకి స్నానం, చేపలు పట్టేందుకు ఎవరూ వెళ్లకుండా చూడాలన్నారు. ముంపు ప్రాంతాల్లో, ముఖ్యంగా కొండ ప్రాంతాల్లో నివసించే వారికి నిత్యావసర సరుకులు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వరద తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా గోదావరి తీర ప్రాంత ప్రజలు అధికారులతో సహకరించి సురక్షిత ప్రాంతాలకు తరలి రావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

డాలర్ పంట ధమాల్

- కుదేలైన ఆక్వా రంగం
- పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేక రైతులు లబోదిబో

ఆచంటలో ఆక్వా చెరువులు

ప్రజాశక్తి - ఆచంట

పెరిగిపోయిన పెట్టుబడులు, భూముల లీజులు, మరోపక్క దిగజారుతున్న ధరలు, చుట్టుముడుతున్న వైరస్‌లు ఆక్వా రైతులపై ముప్పేట దాడి చేస్తున్నాయి.టీ క్రమంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల మోతతో కనీసం పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేక రైతులు లబోదిబోమంటున్నారు. సుంకాల భారం చూపి ఎగుమతిదారులు, కంపెనీలు రొయ్యల ధరలను అమాంతం తగ్గించడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలో సుమారు 1200 ఎకరాల్లో వనామీ రొయ్యల సాగు అధికంగా ఉంది.

మరో రెండు నెలల్లో పంట చేతికి

మరో రెండు నెలల్లో రైతుల చేతికి పంట వస్తుంది. ఈ తరుణంలో అమెరికా సుంకాల దెబ్బ ఆ సమయంలో ఏస్థాయిలో ఉంటుందోననే ఆందోళన రైతుల్లో నెలకొంది. ప్రస్తుతం 100 కౌంట్ ధర రూ.240 వరకు ఉందని రైతులు చెబుతున్నారు. అయితే పంట చేతికొచ్చే సమయానికి ఇది రూ.200కు దిగజారే ప్రమాదం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో రైతులకు పెట్టుబడులు రాని పరిస్థితి తప్పదని ఆందోళన చెందుతున్నారు. టైగర్ రొయ్య 20 కౌంట్ ధర నెల రోజుల క్రితం రూ.680 ఉండగా ప్రస్తుతం రూ.570కి తగ్గింది. ఈ లెక్కన నెల రోజుల్లో పనామీ ధర రూ.45, టైగర్ ధర రూ.100కుపైగా తగ్గింది.

డాలర్ పంట ధమాల్

15 ఏళ్ల కిందట వరకు రొయ్యల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించేవారు. ఎకరం చెరువులో 30 నుంచి 40 వేలు వరకూ సీడ్ వేసేవారు. ఏరియేటర్లు, డీజిల్ ఇంజిన్లు వినియోగించేవారు. మేత ధర టన్ను రూ.30 వేల నుంచి రూ.40 వేల మధ్య ఉండేది. లీజు ఎకరాకు రూ.20 నుంచి రూ.40 వేల మధ్యలో ఉండేది. వ్యాధుల బెడద తక్కువగా ఉండేది. దీంతో సులభంగా 30 నుంచి 40 వరకు కౌంట్‌కు వచ్చేవి. అప్పట్లో 40 కౌంట్ ధర రూ.400 వరకు ఉండటంతో రైతులకు లాభాల పంట పండేది. ప్రస్తుతం ఎకరానికి 1.50 లక్షల పిల్లలను చెరువులో వదులుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంట్ బిల్లులు అధికంగా ఉంటున్నాయి. ఒక టన్ను మేత ధర రూ.80 వేలకు చేరింది. చెరువుల్లో వదిలే రొయ్య పిల్లల సంఖ్య మూడు రెట్లకు పెరగడంతో అదే రీతిలో మేత వేయాల్సి వస్తుంది. దీంతో ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక వ్యాధుల సంగతైతే చెప్పనవసరం లేదు.

ఎకరాకు రూ.లక్షపైనే నష్టం

రొయ్యల ఉత్పత్తి బాగా ఉంటే ఎకరానికి రెండు టన్నుల దిగుబడి ఉంటుంది. ప్రస్తుతం సగటున ఎకరానికి 1.50 టన్నులకు మించి దిగుబడి రావడం లేదు. ఈ లెక్కన ఉన్న ధరతో ఎకరాకు రూ.3.50 లక్షలకు మించి రాబడి ఉండటం లేదు. దీంతో ఎకరాకు సొంత రైతుకు రూ.లక్షకు తగ్గకుండా, కౌలు రైతుకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు నష్టపోవాల్సి వస్తుంది.

ఆక్వాను వ్యవసాయ రంగంగా గుర్తించాలి

బాలం లీలా సుబ్రహ్మణ్యం, ఆక్వా రైతు, ఆచంట



ప్రస్తుతం ఆక్వా రంగం కష్టకాలం లో ఉంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలు విధించడం దారుణం. ఆక్వాను వ్యవసాయ రంగంగా గుర్తించాలి. మార్కెట్ ఒడిదుడుకులతో నష్టపోతున్నాం. పెట్టుబడులు, ఖర్చులు పెరగడం, రొయ్యల ధరలు దిగజారడంతో నష్టాల బారిన పడుతున్నాం. పెట్టుబడులకు తెచ్చిన అప్పులకు వడ్డీలకు చాలడం లేదు.

సాగు వదిలేసే పరిస్థితులొస్తున్నాయి

ఇళ్ల గణపతి, ఆక్వా రైతు, పాలకొల్లు

ఆక్వా సాగు చేస్తున్న కౌలు రైతులకు విద్యుత్ రొయ్యల మేత వాటిపై సబ్సిడీ పెంచాలి. రొయ్యలు కొనుగోలు, ఫీడ్ తయారీ, హేచరీ కంపెనీలు వివిధ రాజకీయ నేతల కనుసన్నల్లో నడుస్తున్నాయి. ప్రభుత్వం వారితోనే చర్చలు, సంప్రదింపులు జరిపి సామాన్య రైతులకు గిట్టుబాటు ధర లేకుండా చేస్తోందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఫీడ్‌కు సంబంధించి ముడి సరుకుల ధరలు తగ్గినా ఫీడ్ ధర కంపెనీలు తగ్గించకపోవడంతో అప్పుల పాలవుతున్నాం. ఎకరం రొయ్యల సాగుకు రూ.నాలుగు లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చువుతుంది. ఈ క్రమంలో వ్యాధులు, సుంకాల బాదుడుతో ధర దిగజారడం వంటి కారణాల రీత్యా సాగు వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

30, 31 తేదీల్లో

జంగారెడ్డిగూడెంలో రైతుసంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఎపి రైతుసంఘం జిల్లా మహాసభ ఈ నెల 30, 31 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ చెప్పారు. మంగళవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో రైతాంగ సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మూడేళ్లకోకసారి అన్ని స్థాయిల్లో సంస్థాగతంగా సంఘం మహాసభ నిర్వహిస్తారని చెప్పారు. సంఘం అన్ని పంటల సంఘంగా విశేష కృషి చేస్తోందన్నారు. ఇటీవల కాలంలో కోకో, ఆయిల్‌పామ్, కొబ్బరి, వరి, మొక్కజొన్న, అపరాలు, పత్తి, వర్జీనియా పొగాకు తదితర పంటల రైతుల సమస్యలపై అనేక ఆందోళనలు, పోరాటాలు నిర్వహించిందని గుర్తు చేశారు. ఫలితంగా రైతుల సమస్యలు అనేకం పరిష్కారమయ్యాయన్నారు. సాగునీరు, వ్యవసాయానికి కరెంట్, చింతలపూడి ఎత్తిపోతల పథకం వంటి అనేక సాగునీటి ప్రాజెక్టుల సమస్యలపై సంఘం తనవంతు కృషి చేసిందన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల సమస్యలపై పోరాడుతున్నామని చెప్పారు. మెట్ట ప్రాంతంలో ఉద్యాన పంటల సమస్యలపై సంఘం పని చేస్తుందని చెప్పారు. రైతాంగ సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ నిర్ణయం కోసం జంగారెడ్డిగూడెంలో నిర్వహిస్తున్న రైతుసంఘం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు నిర్మించాలి

గ్రీన్ ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు నిర్మించాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. భూములు కోల్పోతున్న రైతులకు అన్యాయం చేశారని విమర్శించారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని కోరారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. ఈ పథకం పూర్తి చేస్తామని హామీలిచ్చి గాలికొదిలేయడం తగదన్నారు. భూములు కోల్పోతున్న రైతాంగానికి న్యాయమైన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిరిబత్తుల సీతారామయ్య, కోర్స జలపాలు, జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నగరంలో మహిళలు, యువతులు, విద్యార్థినుల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని, ముఖ్యంగా మహిళలు మహిళా చట్టాలపై, రక్షణపై అవగాహన కలిగి ఉండాలని ఏలూరు మహిళా స్టేషన్ ఎస్ఐ నాగమణి తెలిపారు. ఎస్పి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు డిఎస్పి డి.శ్రావణకుమార్ పర్యవేక్షణలో ఏలూరు మహిళా స్టేషన్ సిఐ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో ఏలూరు శక్తిటీమ్ సభ్యులు మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు అత్యవసర స్థితిలో తమ భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. 181 మహిళల హెల్ప్‌లైన్ నెంబర్‌కు గృహ హింస, వేధింపులు, లైంగిక దాడులపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. శక్తి యాప్ నెంబర్ 7993485111కు అత్యవసర సమయాల్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. శక్తి యాప్‌లోని ఎస్‌విఎస్ బటన్ నొక్కటం ద్వారా వెంటనే మీ సమాచారం తెలియటంతోపాటు, లోకేషన్ సైతం పోలీసులకు తెలుస్తుందని, వెంటనే పోలీస్ సిబ్బంది మీకు అండగా నిలుస్తారని తెలిపారు.

మాట్లాడుతున్న ప్రముఖులు

రైతుల అభ్యున్నతికి కూటమి కృషి

గోపాలపురం ఎఎంసి ఛైర్మన్ బ్రహ్మారాజు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

రైతుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని గోపాలపురం ఎఎంసి ఛైర్మన్ యద్దనపూడి బ్రహ్మారాజు అన్నారు. ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర విశాల సహకార సంఘం మహాజన సర్వసభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం సొసైటీ వద్ద ఛైర్మన్ పోలిన శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా ఎఎంసి ఛైర్మన్ యద్దనపూడి బ్రహ్మారాజు, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్రహ్మారాజు మాట్లాడుతూ కూటమి రైతు ప్రభుత్వమని, రైతులకు అన్ని రకాల ఎరువులు, వ్యవసాయ పనిముట్ల పంపిణీకి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. సొసైటీ ఛైర్మన్ పోలిన శ్రీనివాసరావు మాట్లాడుతూ గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు సహకారంతో సొసైటీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి మాజీ ఛైర్మన్ పాకలపాటి గాంధీ, సర్పంచి కుంటం స్వర్ణలత, సొసైటీ డైరెక్టర్ చిలుకూరి సూర్యవతి, తదితరులు పాల్గొన్నారు.


బోనస్ అందిస్తున్న చలసాని ఆంజనేయులు

పాడి రైతులకు బోనస్ అందజేత

ప్రజాశక్తి - ముసునూరు

ప్రతి పాడి రైతు పాల ఉత్పత్తులు పెంచుకోవచ్చని విజయ పాల సొసైటీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. మండల క్లస్టర్ పరిధిలోని అక్కిరెడ్డిగూడెం పాల ఉత్పత్తిదారులు పరస్పర సహాయక సహకార సంఘంలో 2024 - 2025 ఆర్థిక సంవత్సరానికి పాల ఉత్పత్తి దారుల సంఘం బోనస్ 240 మంది పాడి రైతులకు రూ.2,29,070 ఛైర్మన్ చలసాని ఆంజనేయులు చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పాడి గేదెలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పేయ్యదూడ పుట్టే సిమెన్ గురించి వివరించారు. కృష్ణా మిల్క్ యూనియన్ వారు రాయి ద్వారా కేవలం రూ.50 అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పులిబళ్ల లక్ష్మీసత్యనారాయణ, పాల సొసైటీ ఛైర్మన్ అధ్యక్షులు బజారు రమేష్, డెయిరీ సంఘం పాలకవర్గ సభ్యులు, పాల ఉత్పత్తి దారులు, వేతన కార్యదర్శి, సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

దళిత బహుజన నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బహిరంగ సభలో పాల్గొని 81 సంవత్సరాలు అయిన సందర్భంగా మంగళవారం ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పలువురు దళిత సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా దళిత బహుజన నాయకులు, నేతలు రమేష్‌బాబు, దాసరి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని, పాలితులుగా ఉన్న బహుజనులంతా పాలకులుగా మారాలని, అదే అంబేద్కర్‌కు ఇచ్చే ఘన నివాళి అని చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు చింతా మహాలక్ష్ముడు, బురకాయల రత్నరాజేష్, అందుగుల జ్యోతి, లావూరి సత్యవాణి, దారా శివకుమార్, శ్రీకుర్మం వెంకట రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

నోట్ – క్యాలెండర్ యాడ్ పర్పస్

సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా శొంఠి రాము

ప్రజాశక్తి - ముదినేపల్లి

వైసిపి ముదినేపల్లి మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా మండలంలోని శ్రీహరిపురం పంచాయతీ శివారు చేవూరుపాలేనికి చెందిన శొంఠి రాము(చిన్నా) నియమితులయ్యారు. ఈ మేరకు దూలం నాగేశ్వరరావు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా మంగళవారం రాము మాట్లాడుతూ డిఎన్ఆర్ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ పదవి రావడానికి సహకరించిన మాజీ ఎంఎల్ఎ డిఎన్ఆర్, ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, పార్టీ మండలాధ్యక్షులు బోయిన రామరాజులకు ఈ సందర్భంగా రాము కృతజ్ఞతలు తెలిపారు.

దళిత వ్యతిరేక విధానాలను మానుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ముఖ్య మంత్రులు అనుసరిస్తున్న దళిత వ్యతిరేక విధానాలను మానుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు ఆర్ఎస్.రత్నాకర్ అన్నారు. నగరంలోని లేడీస్ క్లబ్ హాలులో రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న దళిత వ్యతిరేక విధానాలపై విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రత్నాకర్ మాట్లాడుతూ చంద్రబాబు, రేవంత్‌రెడ్డి దళితుల మధ్య చిచ్చు పెట్టారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విడుదల చేసిన జిఒ 25ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌సిలను వర్గీకరించే అధికారం పార్లమెంట్‌కు మాత్రమే ఉందని, రాష్ట్ర ప్రభుత్వాలకు లేదన్నారు. ఎస్‌సిలోని మాదిగ, మాదిగ ఉపకులాల అభ్యున్నతికి అదనపు నిధులు కేటాయించాలని కోరారు. రెల్లీలు, బుడగ జంగాలు, ఇతర కులాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌సి వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతపై దేశవ్యాప్తంగా అతి పెద్ద రాజకీయ కుట్ర జరుగుతుందన్నారు. దళితులు రాజ్యాధికారం సాధించే దిశగా చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కీర్తి నారాయుడు, ఈదూరి గంగరాజు, నంబూరు వరప్రసాద్, తుమ్మల ఫ్రాన్సిస్, కొప్పుల ప్రేమ్, ఉప్పు లక్ష్మీకాంత్, మత్తే బాబి, ఎన్.సూరిబాబు, ఎన్.సునీల్, కనికెళ్ల నాని, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

గుండె ఆరోగ్యం తప్పనిసరి

వేణు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రముఖ గుండె వైద్య నిపుణులు వేణు

చిట్ చాట్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



గుండె ఆరోగ్యాన్ని తప్పనిసరిగా కాపాడుకోవాలని వేగవరంలోని వేణు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రముఖ గుండె వైద్య నిపుణులు వేణు అన్నారు. రోజువారీ చిన్న చిన్న అలవాట్లలోనే గుండె ఆరోగ్యం ఉందని చెప్పిన ఆయనతో చిట్‌చాట్...

ప్రశ్న : ప్రజలకు మీరు చెప్పలనుకున్న ముఖ్యమైన సందేశం ఏమిటి?

డాక్టర్ : గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అంటే రోజువారీ చిన్న అలవాట్లతో మొదలవుతుంది. సరైన ఆహారం, వ్యాయామం, ధూమపానం నివారణ, మానసిక ప్రశాంతత ఇవి నాలుగు ముఖ్యమైన సూత్రాలు.

ప్రశ్న : యువతలో కూడా గుండె సమస్యలు పెరగడానికి కారణాలు ఏమిటి?

డాక్టర్ : జీవనశైలిలో మార్పులు, జంక్ ఫుడ్, ఎక్కువగా మొబైల్, ల్యాప్‌టాప్ వినియోగం, ఒత్తిడి ప్రధాన కారణాలు. యువతరం 30 ఏళ్ల లోపే గుండెపోటు బారిన పడుతున్నారు.

ప్రశ్న : గుండె ఆరోగ్యం కోసం సాధారణంగా పాటించాల్సిన డైలీ టిప్స్ ఏమిటి?

డాక్టర్ : ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల నడవాలి. వ్యాయామం చేయాలి. పండ్లు, కూరగాయలు, తక్కువ నూనె వాడిన ఆహారం తీసుకోవాలి. సిగరెట్, మద్యం పూర్తిగా మానుకోవాలి. రక్తపోటు, షుగర్ పరీక్షలు చేయించుకోవాలి.

ప్రశ్న : అత్యవసర పరిస్థితిలో గుండెపోటు లక్షణాలు ఏమిటి?

డాక్టర్ : ఛాతి నొప్పి, చెమటలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఎడమ చేయి లేదా దవడ వైపు నొప్పి రావడం సిగ్నల్స్. వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

ప్రశ్న : ప్రజలకు మీరు ఏం సందేశం ఇవ్వనున్నారు?

డాక్టర్ : మీ గుండె మీ జీవితం. దాన్ని జాగ్రత్తగా చూసుకోండి. ప్రతిఒక్కరూ హార్ట్ చెకప్ రెగ్యులర్‌గా చేయించుకోవాలి.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని బొమ్మినంపాడు కొత్తహరిజనవాడలో మంగళవారం ప్రకృతి వ్యవసాయం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం మండల యూనిట్ ఇన్‌ఛార్జి గౌతమ్ కుమార్ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రకృతి వ్యవసాయ పెరటి తోటల మోడల్స్ ఎటిఎం విధానంలో కూరగాయలు, ఆకుకూరల, తీగ జాతులు, దుంప జాతులు, స్వీట్ కార్న్, బంతి మొక్కలు ఐసిఆర్‌పి అనూష ఇంటి ఆవరణలో నాటారు. ఈ సందర్భంగా గౌతమ్ కుమార్ మాట్లాడుతూ ఈ విధానంలో ఆరోగ్యకరమైన కూరగాయలు కుటుంబ అవసరాలకు వినియోగించుకుని మిగిలిన వాటిని ఇతరులకు విక్రయించడం ద్వారా ఆదాయం కూడా పొందవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం

ప్రజాశక్తి - కలిదిండి

గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని కైకలూరు ఎంఎల్ఎ కె.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సంతోషపురం, భాస్కరరావుపేట, మూలలంక గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన మంగళవారం ప్రారంభించారు. మూలలంక పిహెచ్‌సికి స్టోర్ రూమ్, పుట్టిన పిల్లలకు వామర్ బాక్స్ ఏర్పాటు చేయాలని ఎంఎల్ఎ ను గ్రామస్తులు కోరారు. ఎంబిబిఎస్ అనంతరం పీజీ నీట్‌లో రాష్ట్ర 12వ ర్యాంక్ సాధించిన పాల భానుశ్రీని అభినందించి, శాలువా కప్పి సన్మానించారు. నాయకులు పోకల జోగిరాజు, వల్లభనేని శ్రీనివాసచౌదరి, అంద్రాజు శ్రీనివాసరావు, లంకా రత్నారావు, ఆయా గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

ఓటు చోరీ ప్రజాస్వామ్యానికి అవమానకరం : కాంగ్రెస్

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఓటు చోరీ జరగడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో ఆ పార్టీ పోలవరం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ బండి విజయ భాస్కర్ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడు గుత్తుల సత్యనారాయణ అధ్యక్షతన సంతకాల సేకరణ, ర్యాలీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఎపిసిసి ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షురాలు షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో సంతకాల సేకరణ చేపట్టినట్లు తెలిపారు. బండి విజయభాస్కర్ దేశంలో ఓటును దోచుకుంటుంటే, రాష్ట్రంలో విద్యను దోచుకుంటున్నారని, పోలవరం నియోజకవర్గంలో ఇసుకను దోచుకుంటున్నారని చెప్పారు. దేశవ్యాప్తంగా ప్రజలు బిజెపి ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారన్నారు. ప్రతి ఒక్క ఓటరు గమనించి రానున్న రోజుల్లో బిజెపి ప్రభుత్వానికి భారతదేశ ప్రజలంతా ఓటు రూపంలో బుద్ధి చెప్పాలన్నారు.

వ్యవసాయ రంగ అభివృద్ధితోనే జిల్లా అభివృద్ధి

వ్యకాస జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ

జిల్లా 32వ మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - టి.నరసాపురం

వ్యవసాయ రంగ అభివృద్ధితోనే జిల్లా అభివృద్ధి ముడిపడి ఉందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. మండల కేంద్రమైన టి.నరసాపురంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం వ్యకాస నాయకురాలు బుద్దల గంగాభవాని అధ్యక్షతన వ్యవసాయ కార్మిక సంఘం మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో రైతులతో పాటు వ్యవసాయ కార్మికులు జోడెడ్లులాంటి వారన్నారు. వ్యవసాయ కార్మికులు వ్యవసాయ రంగంలో సంపద సృష్టించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. రైతులు, వ్యవసాయ కార్మికుల శ్రమవల్లే సామాన్యుని నుంచి దేశప్రధాని వరకూ ఐదువేళ్ల నోట్లోకి వెళ్తున్నాయని గుర్తు చేశారు. వారి సమస్యలపై నిరంతరం పనిచేసే సంఘం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘమని తెలిపారు. సంఘం జిల్లా 32వ మహాసభ అక్టోబర్ 27, 28, 29 తేదీల్లో టి.నర్సాపురంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభ మొట్టమొదటిసారి టి.నర్సాపురంలో నిర్వహించడం ఇక్కడ ఉద్యమాలు పోరాటాలకు మంచి ఉత్సాహం అందిస్తాయని తెలిపారు. ఈ మహాసభకు టి.నర్సాపురం మండలంలో ఉన్న రైతాంగం, కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారవేత్తలు, అభ్యుదయవాదులు, సాహితీవేత్తలు, విద్యావేత్తలు అన్ని రకాలుగా సహకరించాలని కోరారు. ఈ మహాసభ జయప్రదానికి ప్రతిఒక్కరూ చేయూతను అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎ.రవి, జిల్లా సహాయ కార్యదర్శి జి.వెంకట్రావు, జిల్లా కమిటీ సభ్యులు డి.సత్యనారాయణ, టి.సత్యనారాయణ, మండల నాయకులు గాంధీ, దుర్గమ్మ, చెల్లమ్మ, పద్మ, పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - చింతలపూడి

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చింతలపూడి నగర పంచాయతీలో సుమారు 15 సంవత్సరాల నుంచి పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు సిఐటియు, ఎఐటియుసి నాయకత్వంలో చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిఒల ప్రకారం జీతాలు చెల్లించడంలేదన్నారు. గత నాలుగున్నరేళ్ల నుంచి మున్సిపల్ కమిషనర్ల, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా న్యాయం జరగలేదని సిఐటియు జిల్లా నాయకులు ఆర్‌విఎస్.నారాయణ, ఎఐటియుసి జిల్లా నాయకులు తుర్లపాటి బాబు చెప్పారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి కార్మికులకు న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.పద్మ, నాగమణి, వంశీ, చిన్నయ్య, రాజీ, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న పారిశుధ్య కార్మికులు

రైతులకు సత్వర సేవలే సొసైటీ లక్ష్యం

నారాయణపురం సొసైటీ ఛైర్మన్ కడియాల రవిశంకర్

మాట్లాడుతున్న కడియాల రవిశంకర్

ప్రజాశక్తి - ఉంగుటూరు

రైతులకు సత్వరమే నాణ్యమైన సేవలు అందించేందుకు వినూత్న ఆలోచనలో ఫిర్యాదు బాక్సులు ఏర్పాటు చేస్తున్నామని నారాయణపురం సొసైటీ ఛైర్మన్ కడియాల రవిశంకర్ అన్నారు. ఆయన అధ్యక్షతన మంగళవారం సర్వజన మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సొసైటీ పరంగా ఏమైనా సమస్యలుంటే నిరభ్యంతరంగా తమ విన్నపాలు, ఫిర్యాదులను బాక్సులో వేస్తే వారం వారం వాటిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో రూ.2.28 కోట్ల లాభం, రూ.119 కోట్లు టర్నోవర్ సాధించామని తెలిపారు. రైతులకు వివిధ రకాల రుణాలు రూ.82.10 కోట్లు, ఎరువులు, పురుగుమందుల అమ్మకాలు రూ.4.48 కోట్లు చేరుకున్నామని సొసైటీ సిఇఒ అయ్యింకి రంగ నగేష్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కె జ్యోతి అయ్యప్ప, సొసైటీ డైరెక్టర్లు గౌతు బాలభాస్కర్, బోట్టా దుర్గారావు, చేబ్రోలు సర్పంచి రాంధే లక్ష్మీసునీత, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఊటసముద్రంలో సమస్యల పరిష్కారానికి కృషి

చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

చింతలపూడి : ఊటసముద్రం గ్రామ పంచాయతీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని ఊట సముద్రం పంచాయతీ ఖండ్రికగూడెం గ్రామం నుంచి సీనియర్ నాయకులు పాముల పాటి నర్సారెడ్డి, అప్పిరెడ్డి నాగు అధ్యక్షతన గ్రామంలో రోడ్ల సమస్యపై వినతిపత్రం అందించారు. పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సెల్ టవర్ అడిగిన వెంటనే మంజూరు చేశామని, రేషన్ దుకాణం ఏర్పాటు చేస్తామని తెలిపారు. పాఠశాలలో హిందీ ఉపాధ్యాయ పోస్టు భర్తీ చేసేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు ఎంఎల్ఎకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ ప్రెసిడెంట్ చింతనిప్పుల వెంకట రామకృష్ణ, ఎంపిటిసి సభ్యులు పల్లెల ప్రసాద్, సీనియర్ నాయకులు పెనుమత్స రామరాజు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - ముదినేపల్లి

సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వడాలి గ్రామంలో మంగళవారం వ్యాపారులకు అవగాహన కల్పించారు. నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు ఆధ్వర్యంలో కిరాణా షాపులను, స్వీట్స్ షాపులను, బట్టల షాపులతో పాటు ఇంటింటిని సందర్శించి తగ్గించిన జిఎస్‌టి ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తూ ఎంత పొదుపు కలుగుతుందో అవగాహన కల్పించారు. అలాగే ఆక్వా రైతులకు రూ.1.50 పైసలు యూనిట్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోమని కోరారు. గృహ వినియోగ విద్యుత్‌పై ట్రూడౌన్ ఛార్జీలు యూనిట్‌కు 13 పైసలు తగ్గించనున్నట్లు నరసింహారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షులు నక్క అప్పారావు, కార్యదర్శులు అనగాని తిరుమలరావు, జోగి వెంకట సుబ్రహ్మణ్యం, కట్టా రామయ్య, గొర్రెల అర్జున్‌రావు, కోశాధికారి బుద్ధా కాశీ వరప్రసాద్, యూనిట్ ఇన్‌ఛార్జి వీరమల్లు శేషు, చిలకలపల్లి పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి : సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్‌పై చింతలపూడిలో ఎంపిడిఒలతో చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ సమావేశం నిర్వహించారు. జిఎస్‌టి లాభాలను ప్రజలకు వివరించేందుకు పలు కార్యక్రమాలు చేపట్టాలని ఎంఎల్ఎ రోషన్‌కుమార్ అధికారులను ఆదేశించారు.

గ్రామస్తుల సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలో బయ్యన్నగూడెం నుంచి సరిపల్లి రోడ్డు వరకు రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డుకు గ్రామస్తులు సుమారు రూ.1.50 లక్షలతో మరమ్మతులు నిర్వహిస్తున్నారు. బేబీ చిప్స్, డస్ట్‌తో కూడిన మెటీరియల్ గోతులు పూడ్చడానికి ఉపయోగిస్తున్నారు. ఇదే దారిలో ఉన్న ప్రాథమిక వైద్యశాలకు రోగులు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు కూడా పాఠశాలలకు వెళ్లడానికి అనువుగా ఈ మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. బయ్యన్నగూడెం నుంచి సుమారు పది గ్రామాలకు ప్రధాన రహదారిగా ఉన్న ఈ రోడ్డుకు ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చింతమనేనిని కలిసిన నూతన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - దెందులూరు

పేదల పట్ల మీకున్న సేవాగుణాన్ని స్ఫూర్తిగా తీసుకుని మా ఉపాధ్యాయ వృత్తిని కొనసాగిస్తామని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌తో పలువురు నూతన ఉపాధ్యాయులు తమ ఆనందాన్ని పంచుకున్నారు. సిఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారుల కృతజ్ఞతలు, డిఎస్‌సి విజేతల ఆనందాలతో దుగ్గిరాలలోని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ క్యాంపు కార్యాలయం మంగళవారం ఉదయం కోలాహలంగా నిలిచింది. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఉదయం నియోజకవర్గ పరిధిలోని పలువురు కూటమి నాయకులు, అధికారులు, ప్రజలు ఎంఎల్ఎను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈఈ సందర్భంగా దెందులూరు నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల నుంచి విచ్చేసిన ప్రజల నుంచి వారి సమస్యలపై వినతులు స్వీకరించిన ఎంఎల్ఎ వాటిని పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారకి మంజూరైన సిఎం సహాయనిధి చెక్కులను బాధితుల కుటుంబ సభ్యులకు అందించారు. అదేవిధంగా చింతమనేని ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా మెగా డిఎస్‌సిలో ఉచిత శిక్షణ పొంది ఇటీవల సిఎం చంద్రబాబు ఆధ్వర్యంలో అమరావతిలో జరిగిన కార్యక్రమంలో డిఎస్‌సి నియామక పత్రాలను అందుకున్న పలువురు నూతన ఉపాధ్యాయులు నియామక పత్రాలతో చింతమనేని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

పలుచోట్ల అన్న సమారాధన

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపం ట్రస్ట్ ఆధ్వర్యంలో అమ్మవారి దసరా ఉత్సవాల సందర్భంగా మంగళవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. సుమారు నాలుగు వేల మందికి అన్నదానం చేశారు. ఆర్యవైశ్య సంఘ ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి ఊరేగింపు కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఇమ్మడి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మానేపల్లి సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షులు ఇమ్మడి రత్నాజీ పాల్గొన్నారు.

చింతలపూడి : చింతలపూడి మేరక వీధిలో దసరా నవరాత్రుల సందర్భంగా సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి ఎఎంసి ఛైర్‌పర్సన్ చీదరాల దుర్గాపార్వతి, జనసేన పార్టీ మండలాధ్యక్షులు చీదరాల మధుబాబు పాల్గొని మాట్లాడారు.

పాస్‌పోర్ట్ పోయినది

ఏలూరు జిల్లా, పెదపాడు మండలం, గుడిపాడు గ్రామానికి చెందిన ముప్పల రాంబాబు అను నేను నా యొక్క పాస్‌పోర్ట్ పడిపోయింది. ది. 15-08-2025 తేదిన గుడిపాడు-నాయుడుగూడెం బైక్ పై వెళుచుండగా మార్గమధ్యలో పడిపోయింది. పాస్‌పోర్ట్ నెంబర్: **P5216895** ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు. ఎవరికైన దొరికిన పై నా అడ్రస్ కు అందజేయగలరు.

నా సెల్ నెం: 89850 27773

మహారాజశ్రీ 3వ అదనపు (మొబైల్) జూనియర్ సివిల్ జడ్జి ఏలూరు

ఓ.యస్. నెం: 122/2023

బిట్వీన్:
కొండు నిర్మలకుమారి ...వాది
మరియు
కేదారి H.V. సూర్యశ్రీకాంత్ మరియొకరు ...ప్రతివాదులు

వాది దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల దావాలో 2వ ప్రతివాది అయిన కేదారి లీలాగాయత్రి D/o. కేదారి కొండలరావు, D.No: 30-12-22, పంపులచెరువు రోడ్డు, పడమరవీధి, వంగాయగూడెం, ఏలూరు, ఏలూరు జిల్లా వారికి పై కోర్టులో **ది. 07-10-2025 సం॥ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** వాయిదా అయి ఉన్నది. సదరు ప్రతివాది స్వయంగా గాని, లేదా ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరయి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవచ్చును. లేని ఎడల సదరు దావా తమ పరోక్షమున విచారణ చేయుదురని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

ఆవుల జగన్మోహనరావు
పుప్పాల రామకృష్ణ
ఏలూరు — అడ్వకేట్స్, ఏలూరు
ది.30-09-2025 — ఏలూరు జిల్లా
సెల్: 99890 89289

వేలం ప్రకటన

మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు నందు

ఇ.పి. నెం: 69/2018 ఇన్ ఓ.యస్. నెం: 258/2018

బళ్ల అనంతలక్ష్మి ...వాది/డిక్రీ హూల్డర్
ఎదిరి
పాము శ్రీధర్ ...ప్రతివాది/జడ్జిమెంట్ డేటార్

పై నెంబరు దావాలోని డిక్రీ ప్రకారం పై డిక్రీ హూల్డర్ పై నెంబరు వారంటు అమలు గ్రంథమును ఇ.పి. షెడ్యూలు దాఖలా ఆస్తిని కోర్టు ద్వారా బహిరంగముగా వేలం వేయించి సదరు డిక్రీ బాకీ వసూలు చేయించి ఇప్పించ గలందులకు కోర్టు వారిని కోరుచూ దాఖలు చేసియున్నారు. అందుపై పై కోర్టు వారు ఈ ఇ.పి. షెడ్యూలు దాఖలా ఆస్తిని కోర్టు ద్వారా **ది. 23-10-2025 సం॥ తేదిన** పై కోర్టు వారి ఎదుట **ఉదయం గం. 10-30 ని.ల నుండి** బహిరంగముగా వేలం వేయించుటకు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున కావలసినవారు పాల్గొని పాడుకొనవచ్చును.

వేలపు ఆస్తి వివరము

పశ్చిమగోదావరి జిల్లా, మొగల్తూరు మండలం, మొగల్తూరు సబ్ రిజిస్ట్రీ లోని, మొగల్తూరు గ్రామంలోని రి.స.నెం. 722/1, క్రొత్త రి.స.నెం. 722/1ఎ1, లో

ఐటం 1: అసెస్మెంట్ నెం. 233, తలుపు నెం. 3-3, గల 156 చ.గజముల స్థలం అందలి గ్రౌండ్ ఫ్లోర్ మరియు 1వ ఫ్లోరు గల ఆర్.సి.సి భవనమునకు హద్దులు:
తూర్పు - గ్రంధి వారికి పువ్వాడ వారికి చెందిన ఉమ్మడి దారి మార్గం
దక్షిణం - పువ్వాడ వెంకటేశ్వరరావు వగైరాల గోడ
పడమర - మాతంగి పేటకు వెళ్ళు దారి
ఉత్తరం - గ్రంధి సత్యవతి గారి ఇల్లు స్థలం
156 చ.గజముల స్థలం అందలి గ్రౌండ్ ఫ్లోర్ మరియు 1వ ఫ్లోర్ గల ఆర్.సి.సి. భవనము అందలి అంటి యున్న గృహోపకరణములు మరియు యావత్తు ఈజిమెంట్ హక్కులతో సహా.

ఐటం 2: అసెస్మెంట్ నెం. 283, తలుపు నెం. 3-60, గల 139 చ.గజముల స్థలం అందలి గ్రౌండ్ ఫ్లోర్ మరియు 1వ ఫ్లోరు గల ఆర్.సి.సి భవనమునకు హద్దులు:
తూర్పు - గ్రంధి వెంకటేశ్వరరావు గారి స్థలం
దక్షిణం - అనంతపల్లి వారి సరిహద్దు గోడ
పడమర - పాము జ్యోతిశ్రీ గారి ఆస్తి
ఉత్తరం - హైవే రోడ్డు మార్జిన్
139 చ.గజముల స్థలం అందలి గ్రౌండ్ ఫ్లోర్ మరియు 1వ ఫ్లోర్ గల ఆర్.సి.సి. భవనము అందలి అంటి యున్న గృహోపకరణములు మరియు యావత్తు ఈజిమెంట్ హక్కులతో సహా.

డిక్రీహోల్డర్ విలువ ఐటం 1 : Rs. 10,00,000/-
ఐటం 2 : Rs. 10,00,000/-
అమీనా విలువ ఐటం 1 : Rs. 30,00,000/-
ఐటం 2 : Rs. 40,00,000/-
జడ్జిమెంట్ డేటార్ విలువ తెలియజేయలేదు.

సరిపల్లి రామ సత్తయ్య,
ఎం.ఎస్.ఎస్.వి. రమణ,
నర్సాపురం — న్యాయవాదులు, నర్సాపురం
ది.30-09-2025 — సెల్: 98488 37555

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S. 345/2010

Between:
శ్రీమతి వారణాసి వెంకట సూర్యప్రభ మరియు వగైరాలు -వాదులు
AND
శ్రీమతి మలాది భానుమతి మరియు వగైరాలు -ప్రతివాదులు

D-11 / 11వ ప్రతివాది: ద్వారా వెంకట శ్రీనివాస్, S/o. లేటు సత్యనారాయణ, పురుషుడు, 54 సం॥లు, ఎంప్లాయి, వాడపల్లి గ్రామం, కొవ్వూరు మండలం.

D-12 / 12వ ప్రతివాది: ద్వారా వెంకటరత్నం, S/o. లేటు సత్యనారాయణ, ఫ్లాట్ నెం.204, వెంకటేశ్వరా కాలనీ, నెల్లూరు, నెల్లూరు జిల్లా.

D-13 / 13వ ప్రతివాది: నీలం నారాయణమ్మ, W/o. శ్రీనివాస్, డో.నెం. 4-17/30, మిలటరీ కాలనీ, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా.

ప్రకటన

పై నెంబరు దావా నందు ప్రతివాదులు అయిన D11, D12, D13 అయిన మీకు ఎన్నిసార్లు రిజిష్టర్డు పోస్టు ద్వారాను, కోర్టు వారి ద్వారాను దావా సమన్లు పంపించినప్పటికి మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకముగా రిటర్న్ చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం ఈ ప్రకటన ద్వారా D11, D12, D13 ప్రతివాదులు అయిన మీరు **ది. 10-10-2025వ తేదీన ఉదయం 10.30 ని॥** లగాయితు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, వకీలు ద్వారాగా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియచేయగలరు. అట్లు కాని పక్షమున మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎన్.వి.సుబ్బారావు
కొవ్వూరు — అడ్వకేట్, కొవ్వూరు
ది.22-9-25 — సెల్: 9440330449

మునిసిపల్ ఆఫీసు, పాలకొల్లు

ఆర్.ఓ.సి. నెం. 598/2025/ఇ1 — ది.29-09-2025

ఇ-ప్రొక్యూర్‌మెంటు షార్టు టెండరు నోటీసు

పాలకొల్లు పురపాలక సంఘ పరిధిలోని వివిధ వార్డులలో పురపాలక సంఘ సాధారణ నిధులతో - 2 పనులు చేపట్టుటకు గాను అంచనాలు విలువ సుమారు రూ. 36,65,000/-లతో ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా షార్టు టెండర్లు కోరడమైనది. టెండరు షెడ్యూలు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెట్ నందు ది. 01-10-2025 వ తేది సాయంత్రం గం॥ 4.00 ని॥ల నుండి లభించును.

బిడ్ డాక్యుమెంట్ ప్రారంభ తేదీ	: 01-10-2025 సాయంత్రం గం. 04.00 ని.లకు
బిడ్ డాక్యుమెంట్ డౌన్లోడ్ ముగింపు తేదీ	: 08-10-2025 సాయంత్రం గం. 04.00 ని.లకు
ప్రైస్ బిడ్ తెరుచు తేదీ	: 08-10-2025 సాయంత్రం గం. 04.30 ని.లకు

మిగిలిన వివరములు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెటు www.tender.apeprocurement.gov.in లేదా కమిషనరు, పాలకొల్లు పురపాలక సంఘము, పాలకొల్లు, పశ్చిమగోదావరి జిల్లా వారిని సంప్రదించగలరు.

కమిషనరు,
పాలకొల్లు పురపాలక సంఘం.